# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 211  పేజీలు : 04  వెల రూ. 2  ఆదివారం  08 - 02 - 2026




భారత వ్యాక్సిన్లు రాకపోవడం
మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది - పాకిస్థాన్ మంత్రి

## కేసీఆర్ మనోడు కాదు
# పరాయి వాడు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మోదీని చూసి ఓటేస్తే గల్లీ బీజేపీ నేతలు పనిచేయకపోతే ఆయన్ను అడగలేం కదా?
- గులాబీ బాస్ కేసీఆర్ రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి
- వికారాబాద్‌లో సీఎం పర్యటన
- గల్లీ బీజేపీ నేతలు పనిచేయకపోతే, మోదీని అడగలేమని వెల్లడి
- ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు కోసం రూ.38 వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పూనుకున్నారు
- కేసీఆర్ మనోడు కాదని పరాయి వాడని పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారు
- కాళేశ్వరం వల్ల కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయి



హైదరాబాద్ : ఓట్లు కావాలి కానీ ప్రజా సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? రేవంత్ రెడ్డి నిలదీశారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు కోసం రూ.38 వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పూనుకున్నారని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ నాయకుడని చెప్పుకునే కేసీఆర్, రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని, కేసీఆర్ మనోడు కాదని పరాయి వాడని పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారని, ఏపీ మాజీ మంత్రి రోజా పెట్టిన చేపలు పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ చెప్పారని ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కట్టేందుకు - మిగతా 2 లో


## టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలతో
# మురికికూపంలా మేడారం





- మేడారం మహాజాతర ముగింపుతో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు
- సుమారు 3 వేల టన్నుల చెత్త పోగైనట్లు అధికారుల అంచనా
- శుభ్రం చేసేందుకు రంగంలోకి దిగిన 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు
- జంతు వ్యర్థాలు చూసి వాంతులొస్తున్నాయని కార్మికుల ఆవేదన
- వ్యర్థాల్లో 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాలు ఉండటంపై ఆందోళన

హైదరాబాద్ : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వైభవంగా ముగిసింది. అయితే, కోట్లాదిగా తరలివచ్చిన భక్తులు వెనుదిరిగిన అనంతరం మేడారం పరిసరాలు టన్నుల కొద్దీ చెత్తతో నిండిపోయాయి. ఈ వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు అధికార యంత్రాంగానికి, పారిశుద్ధ్య సిబ్బందికి పెను సవాల్‌గా మారింది. మేడారంతో - మిగతా 2 లో




## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

- కారణం వెల్లడించిన ఫైర్ డీజీ విక్రమ్ సింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్ ప్రాపర్టీస్ గదిలో అగ్ని ప్రమాదం
- 1980ల నాటి భవనమని వెల్లడించిన ఫైర్ డీజీ విక్రమ్ సింగ్
- చివరి గదిలో స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ అయినట్లు వెల్లడి




## మలేషియా రాజధానిలో
# ప్రధాని మోదీకి ఘనస్వాగతం

- స్వయంగా ఎయిర్ పోర్టుకు వచ్చిన ప్రధాని అన్వర్
- రెండ్రోజుల పర్యటన నిమిత్తం మలేషియాకు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికిన మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం
- రక్షణ, భద్రత, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యం
- ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి



ఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు మలేషియాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కౌలాలంపూర్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం స్వయంగా సాదర స్వాగతం పలికారు. ఇరు దేశాల జెండాలు చేతబూనిన చిన్నారులు ప్రధాని మోదీకి అభివాదం చేశారు. అనంతరం, ఎయిర్ పోర్టు నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం ఒకే కారులో కౌలాలంపూర్ లోని ఓ కమ్యూనిటీ ప్రోగ్రామ్ కు కలిసి వెళ్లారు. భారత్-మలేషియా మధ్య 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత పటిష్టం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ పర్యటన నేపథ్యంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రక్షణ, భద్రత, ఆర్థిక, ఆవిష్కరణల రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. "భారత్, మలేషియా మధ్య చారిత్రక సంబంధాలు ఇటీవలి కాలంలో గణనీయమైన పురోగతి సాధించాయి. ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో చర్చల కోసం ఎదురుచూస్తున్నాను," అని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 2024లో ఇరు దేశాల సంబంధాలు 'సమగ్ర వ్యూహాత్మక - మిగతా 2 లో

# కదిలిపోయిన పవన్ కల్యాణ్

- సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు
- బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో
- వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు
- ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర



అమరావతి : "పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేక పోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించి పోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జలవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. - మిగతా 2 లో

## చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే


- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- ఐదేళ్లు నిద్రపోయి ఇప్పుడు వైసీపీ ఉద్యమాలు చేయడమేంటని షర్మిల ప్రశ్న
- సంగమేశ్వరం బదులు ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కట్టడంపై అభ్యంతరం
- స్వప్రయోజనాల కోసం సీమ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపణ



అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇద్దరూ నాటకాలు ఆడారని ఆమె ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు. వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. - మిగతా 2 లో

## క్వాంటమ్ విప్లవానికి
# మనదే నాయకత్వం

- ఇది చారిత్రక ఘట్టం: సీఎం చంద్రబాబు
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన
- ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య
- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా
- హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన
- ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి



అమరావతి : "ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక - మిగతా 2 లో

# సంపాదకీయం

## సభాపర్వం నిరాశాజనకం

'మీ స్వరాన్ని పెంచకండి... చట్టసభల్లో మెరుగుపరుచుకోవాల్సింది మీ వాదనను మాత్రమే' అన్నారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా హక్కుల యోధుడు డెస్మండ్ టుటు. దేశంలో చట్టసభల తీరుతెన్నులు చూస్తున్నవారికి ఎప్పుడూ ఖేదమే మిగులుతోంది. చట్టసభల పేరుచెబితే వాగ్యుద్ధాలూ, వాకౌట్లూ గుర్తుకొస్తున్నాయి. ఎప్పటిలాగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కూడా ఆ ధోరణిలోనే సాగుతున్నాయి. ఈసారి పార్లమెంటు లోపలే కాదు, వెలుపల కూడా ఆధిక్యతా ప్రదర్శన కనబడుతోంది. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు జరగబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కావొచ్చు, అధికార విపక్షాలు ప్రత్యర్థుల్లాకాక శత్రుపక్షాల్లా పోట్లాడుకుంటున్నాయి. చివరకు ఎక్కడివరకూ పోయిందంటే... కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీ పట్ల అవాంఛ నీయ చర్యకు పాల్పడే అవకాశం ఉందంటూ తనకు సమాచారం అందటంతో ఆయన్ను సభకు రావొద్దంటూ తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అదంతా అబద్ధమన్నది కాంగ్రెస్ వాదన. నిజానిజాల సంగతలా ఉంచి లోక్‌సభ స్పీకర్ ప్రధానిని సభకు రావద్దని సూచించటం ఊహాకందనిది. ఇలాంటి పరిణామాలు ప్రపంచం దృష్టిలో మన ప్రజాస్వామ్యాన్ని పలచబారుస్తాయి. కాంగ్రెస్ తీరుచూస్తే సభను సాగనివ్వకపోవటమే దాని ఏకైక వ్యూహంగా కనబడు తోంది. దీనిద్వారా ఆ పార్టీ ఎలాంటి సందేశం పంపదల్చుకున్నదోగానీ, కీలకమైన బిల్లులు ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదం పొందుతున్నాయి. పద్దులు గిలెటిన్ అవుతున్నాయి. పాలక పక్షం పని సులభమవుతోంది. సభలో మెజారిటీయే దేన్నయినా నిర్ణయిస్తుంది. విపక్షాలు దాన్ని అడ్డుకోలేవు. కనీసం అర్థవంత మైన చర్చంటూ జరిగితే ఎలాంటి బిల్లులు వస్తున్నాయో, వాటి లోటుపాట్లేమిటో,అందువల్ల కలిగే పరిణామాలేమిటో సామాన్యులు అర్థం చేసుకునే వీలుంటుంది. తమ వ్యూహం సామాన్య పౌరులకు ఆ అవకాశాన్ని నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ గ్రహించటం లేదు. యూపీఏ హయాంలో కూడా బీజేపీ ఇదే వ్యూహాన్ని అమలు చేసింది. దాన్నే తామూ ప్రయోగించి పైచేయి సాధించాలని చూడటం ద్వారా కాంగ్రెస్ ఆశిస్తున్న ప్రయోజనమేమిటో అర్థంకాదు. తోచింది చేసుకుంటూ పోవటం, జరిగే ఘటనలపై అప్పటికప్పుడు అనాలోచితంగా స్పందించటం తప్ప కాంగ్రెస్‌కు పకడ్బందీ వ్యూహం ఉన్నట్టు కనబడదు. బుధవారం పార్లమెంటు మకరద్వారం వద్ద జరిగిన ఘటనే ఇందుకు తార్కాణం. కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జగడం నివారించదగింది. బిట్టూ అక్కడ ధర్నాకు కూర్చున్న కాంగ్రెస్ ఎంపీలనుద్దేశించి అవహేళనగా వ్యాఖ్యానించి ఉండొచ్చు. కానీ అవి యథాలాపంగా అన్న మాటలు కాదు.ఇరుపక్షాల మధ్యా యుద్ధం సాగుతున్న వేళ వ్యూహాత్మకంగా మాట్లాడినవి. రాహుల్ గాంధీ ఆయన్ను కాస్తా ద్రోహి అంటూ నిందించటం ద్వారా బీజేపీకి పదునైన ఆయుధం ఇచ్చారు. పార్టీ మారటం ద్రోహమైతే, అలాంటివారు కాంగ్రెస్‌లో లేరా? అసలు పార్టీని నమ్ముకుని ఉన్నవారి పట్ల అధినేతలుగా తాము చేసిన, చేస్తున్న ద్రోహం మాటేమిటి? అవసరార్థం పక్క పార్టీలతో కుమ్మక్కవుతూ మొత్తంగా పార్టీలో ఉన్నవారందరికీ చేస్తున్న ద్రోహమెంత? రాహుల్‌గాంధీ ఆలోచించారా? పరిస్థితులు మళ్లీ చక్కబడితే బిట్టూ లాంటివారు తిరిగి కాంగ్రెస్ లోకి రారనీ, రాహుల్ తీసుకోబోరనీ ఎవరైనా చెప్పగలరా?ఎందుకో ఈసారి పార్లమెంటులోనూ, వెలుపలా 'పుస్తక ప్రదర్శన' జరిగింది. చైనా నుంచి ముప్పు ముంచుకొస్తున్నవేళ బాధ్యతంతా రాజకీయ నాయకత్వం అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ నరవణేపై వదిలేసి, చేతులు దులుపుకొన్నదని రాహుల్ ఆరోపించారు. జనరల్ నరవణే పుస్తక సారాంశాన్ని సభలో చెబుతానన్న భయంతోనే తనను అడ్డుకున్నారని అన్నారు. దీనికి పోటీగా బీజేపీ సభ్యులు సభలో పుస్తకాలు ప్రదర్శించారు.ఈ దఫా పుస్తకాల ప్రస్తావన రావటం బాగున్నా, వాటిని ప్రదర్శించటంతో సరిపెట్టక ఇరుపక్షాలవారూ ఎవరికివారు చదువుకోవాలి. అప్పుడు మన చట్టసభల తీరు ఇంత అధ్వాన్నంగా అయితే ఉండదు. కనీసం సభల నిర్వహణకయ్యే వ్యయాన్నయినా దృష్టిలో ఉంచుకుని సమావేశాలను వృథా కానీయరాదని రెండు పక్షాలూ గ్రహించటం అవసరం.

# టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలతో మురికికూపంలా మేడారం





**మొదటిపేజీ తరువాయి –** పాటు కన్నెపల్లి, నార్లాపూర్, కొంగల గట్టు వంటి ప్రాంతాల్లో దాదాపు 3 వేల టన్నుల చెత్త పేరుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జంతు, కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో సుమారు 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన శుభ్రతా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.అయితే, ఈ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రోడ్లు, ప్లాస్టిక్ క్లీనింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చారు. కానీ ఇక్కడ జంతువుల తోళ్లు, తలకాయలు, కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాటిని చూస్తుంటేనే వాంతులు వస్తున్నాయి. ఇంత గలీజు పని మేమెప్పుడూ చేయలేదు" అని కొందరు కార్మికులు వాపోయారు. అమ్మవార్ల దయతోనే ఈ పని చేస్తున్నాం అని వారు కన్నీటిపర్యంతమయ్యారు. జాతరలో పోగైన వ్యర్థాల్లో దాదాపు 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాల వంటివి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సుమారు 100 టన్నుల ఖాళీ బాటిళ్లలో చాలా వరకు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మిగిలిన 52 శాతం బియ్యం, బెల్లం వంటివి భూమిలో కలిసిపోయేవిగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యర్థాలను వేరు చేసి, మేడారం ప్రాంగణాన్ని శుభ్రపరిచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్రిప్రమాదంపై కేటీఆర్ అనుమానాలు



**మొదటిపేజీ తరువాయి –** హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగులను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందిస్తూ... ల్యాబ్ మొత్తం కాలిపోతోందని, ఏయే ఆధారాలు నాశనం చేశావు అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రమాదం వివరాల్లోకి వెళితే... ల్యాబ్ లోని తొలి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే భవనంలోని ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం కారణంగా ల్యాబ్ లోని కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు దెబ్బతిన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం



**మొదటిపేజీ తరువాయి –** ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# కదిలిపోయిన పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి –** తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు.పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జలవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి.ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 'పల్లెపండగ 1.0, 2.0', సాస్కి నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జలవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేయడం గమనార్హం.

## చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే

**మొదటిపేజీ తరువాయి –** "గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయిన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు" అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. "ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా?" అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు.మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు. "ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు? మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

## మలేషియా రాజధానిలో ప్రధాని మోదీకి ఘనస్వాగతం

**మొదటిపేజీ తరువాయి –** భాగస్వామ్యం' స్థాయికి చేరిన తర్వాత మోదీ మలేషియాలో పర్యటించడం ఇదే తొలిసారి.మలేషియాలో దాదాపు 30 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారని, వారు ఇరు దేశాల మధ్య 'సజీవ వారధి'గా నిలుస్తున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. తన పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే, ప్రవాస భారతీయులతో పాటు పారిశ్రామిక, వాణిజ్య ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. ఈ పర్యటనకు అనుబంధంగా 10వ ఇండియా-మలేషియా సీఈవో ఫోరమ్ కూడా జరగనుంది.

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం




**మొదటిపేజీ తరువాయి –** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ స్పందించారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ గది పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఫోరెన్సిక్ భవనం చాలా పాతదని, దీనిని 1980లలో నిర్మించారని తెలిపారు. చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ అయినట్లు తెలిపారు. అక్కడి నుంచి మంటలు వ్యాపించాయని, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయని అన్నారు. హైదరాబాద్‌లోని అన్ని భవనాలను తనిఖీ చేస్తామని ఆయన తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ కార్యాలయాలను తనిఖీ చేస్తామని అన్నారు. ఎండాకాలం సమీపించిన నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉందని తెలిపారు.

# కేసీఆర్ మనోడు కాదు పరాయి వాడు



**మొదటిపేజీ తరువాయి –** ప్రణాళికలు పూర్తి చేస్తామని, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయ్యిందని, కాళేశ్వరం వల్ల కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టి ప్రజాధనం వృథా చేశారని, గోదావరి జలాల ముసుగులో వేల కోట్లు కొల్లగొట్టి ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని విమర్శించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవేళ్లను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు."తెలంగాణ ఉద్యమనాయకుడని చెప్పుకునే కేసీఆర్.. రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారు. కేసీఆర్ మనోడు కాదు. పరాయి వాడు. పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారు. రోజమ్మ చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ చెప్పారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కట్టేందుకు ప్రణాళికలు పూర్తి చేస్తాం. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయ్యింది. కాళేశ్వరం వల్ల కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్లను సస్యశ్యామలం చేస్తాం.

**మోదీని చూసి ఓటేస్తే? :** అప్పులున్నా ఎన్నో సంక్షేమ పథకాలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలకులు చేసిన తప్పులను సరిచేస్తూ పాలన కొనసాగిస్తున్నామని, రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నించలేదని, ప్రధాని మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని, పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే పిల్లగాడు పనికి రాకపోతే ఏం చేయాలని ఎద్దేవా చేశారు. మోదీని చూసి ఓటేస్తే, గల్లీ బీజేపీ నేతలు పనిచేయకపోతే, మోదీని అడగలేము కదా అని ప్రశ్నించారు.

**ఆ 2 పార్టీల మధ్య చీకటి ఒప్పందం :** బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారని, కాంగ్రెస్‌తో పోరాడటం మా వల్ల కాదని, బీజేపీతో బీఆర్ఎస్ కలిసిపోయిందని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్ నేతలు అడగకుండానే ఓటేసేవారని అన్నారు. సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్, బీజేపీ నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు.

**కృష్ణానదిలో తేలేవాళ్లు :** కేసీఆర్ దళితులను మోసం చేస్తే దళితుడైన గడ్డం ప్రసాద్ ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్నారని, దళిత వ్యక్తిని సీఎం చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని సీఎం తెలిపారు. తాండూర్‌కు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇస్తామని, పరిగి, వికారాబాద్ మున్సిపాల్టీలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మూసీ సమీపంలోని ఇళ్లలో బీజేపీ నేతలు ఒకరోజు నిద్రపోయారని, వరదలు వచ్చినప్పుడు మూసీ సమీపంలోని ఇళ్లకు వెళ్లాలని బీజేపీ నేతలను కోరానని, వరదలు వచ్చినప్పుడు బీజేపీ నేతలు వెళ్లి ఉంటే మూసీలో కొట్టుకుపోయి కృష్ణానదిలో తేలేవాళ్లని అన్నారు. 70 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యను తొలగించామని పేర్కొన్నారు.

**ఎవరెవరు అడ్డొస్తారో చూద్దాం :** కేసీఆర్, అతని బంధువులందరికీ పదవులు ఉండాలి కాని నిరుద్యోగ పిల్లలకు ఉద్యోగాలు వద్దా అని ప్రశ్నించారు. రాసిపెట్టుకో కేసీఆర్, కిషన్‌రావు ఇంకోసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని, ఇప్పటి నుంచి 8 ఏళ్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, కాంగ్రెస్ హయాంలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఏం కుట్రలు చేస్తారో చేయండని, ఎవరెవరు అడ్డొస్తారో చూద్దామని అన్నారు.

# 60 సీట్లున్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా?

**జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్న జగ్గారెడ్డి**

**ఉచిత బస్సు పథకంపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం**

**ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని వ్యాఖ్య**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే ఉచిత బస్సు పథకంతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు.బియ్యం తక్కువ ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ తమ ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను నెరవేరుస్తోందని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఒక్కో వార్డుకు రూ.8 కోట్లు మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రూ.300 కోట్లు తీసుకువస్తానని అన్నారు. 2013లో 5,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ మొత్తం తిరుగుతానని అన్నారు.

## ఒడిస్సా గవర్నర్ తో తెలంగాణ మీడియా ప్రతినిధి బృందం భేటీ



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** పీఐబీ నేతృత్వంలో తెలంగాణ మీడియా ప్రతినిధి బృందం లోక్ భవన్‌లో ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటిని శనివారం కలిసింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఒడిశా సుస్థిర వృద్ధితో పాటు మిగులు ఆదాయం గల రాష్ట్రంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.రైల్వేలు, జాతీయ రహదారులు, సెమీకండక్టర్ ప్రాజెక్ట్, జాతీయ జలమార్గం5 వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో రాష్ట్ర అభివృద్ధి వేగవంతమవుతోందని తెలిపారు. సహజ వనరులు, ఖనిజ సంపద, వ్యవసాయం, చేనేత–హస్తకళలు ఒడిశా ఆర్థిక బలానికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు.భువనేశ్వర్ విద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా ఎదుగుతోందని గవర్నర్ తెలిపారు. భేటీలో పీఐబీ అధికారులు, తెలంగాణ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించాలి కప్పును సాధించాలి

### కప్ గెలవాలని క్రీడాకారులకు సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ప్రోత్సాహం



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు) :** సీఎం కప్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైన భీమదేవరపల్లి కబడ్డీ జట్టుకు గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి టీ–షర్టు బహుకరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన ఆయన, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కప్పును గ్రామానికి తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. గ్రామ యువత క్రీడల్లో రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో కూడా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, అశోక్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు శివసారపు రవీందర్, మాచర్ల కరుణాకర్, గాజుల కృష్ణ వరదరాజు, దాట్ల మధుకర్, గంగిరెడ్డి హరీశ్, చేరాల ఉదయ్, మాచర్ల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కృష్ణవేణి స్కూల్ విద్యార్థి




**సికింద్రాబాద్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** భోలక్పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు.తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్2026 పోటీల్లో పాల్గొన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి ఏ.కోటేశ్వరరావు అండర్ 35 కేజీ విభాగంలో ప్రతిభ చూపించి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్కూల్‌లోని విద్యార్థులందరికీ కరాటే మాస్టర్ రఘు ద్వారా ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కరాటే వల్ల పిల్లల్లో శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం2026లో భాగంగా బిజెపి బేగంపేట్ డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పాటిగడ్డ +నవీజ గ్రౌండ్‌లో మహిళల కోసం మ్యూజికల్ చైర్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి హాజరై విజేతలైన మహిళలకు మొదటి, రెండో బహుమతులు అందజేశారు. అలాగే పాల్గొన్న మిగిలిన మహిళలకు గిఫ్టులు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ. దయానంద్, మహంకాళిసికింద్రాబాద్ జిల్లా ాదీజ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు యం. మహేష్ కుమార్ ముదిరాజ్, మహిళా మోర్చా నాయకురాలు సంధ్య లక్ష్మీ, డివిజన్ ప్రధాన కార్యదర్శి టి. శ్రవణ్తో పాటు బిజెపి నాయకులు నగేష్, వేణు, గణేష్, సప్న గుప్తా, అనిత, బాబురావు, ఎన్. మహేష్, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల మహాశివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

### టిటిడిఎస్ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి





**భీమదేవరపల్లి ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు) :**మండలంలోని ముత్తారం గ్రామంలో కాకతీయుల కళా కట్టడం ప్రాచీన త్రికూటేశ్వర స్వామి ఆలయంలో మహాశివ రాత్రి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నా యని టీటీడీఎస్ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని దాతల సహకారంతో మూడు రోజులపాటు నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ విజయవంతంగా పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు, శివపార్వతుల కళ్యాణం, లింగోద్భవం, జలాభిషేకం, మహా మృత్యుంజయ హోమం, మహా అన్నప్రసాద వితరణ వంటి పుణ్యకార్యక్రమాలు నిర్వహించబడతాయని చెప్పారు. ఈ మహోత్సవాల్లో పాల్గొని భక్తులు ఆ పరమశివుని అనుగ్రహం పొందాలని కోరారు.ఇప్పటివరకు దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయని, భవిష్యత్తులో కూడా దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

## ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన ఉద్యాన అధికారి

### గడ్డం శ్యాం ప్రసాద్





**గొల్లపల్లి ఫిబ్రవరి 07ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలంలోని శనివారం దట్నూర్ వివిధ ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సందర్శించారు ఈ సందర్భంగా దట్నూర్ గ్రామంలో 23 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న ఒరుగంటి రమణారావు రాజశేఖర్ రావు తోటలను కూడా సందర్శించారు వివిధ దశలలో ఉన్న ఆయిల్ పామ్ గెలలను పరిశీలించి వాటికి తగు ఎరువుల యాజమాన్యం పద్ధతులను వివరించారు ఒక్కో ఆయిల్ పామ్ చెట్టుకు దాదాపు10 నుండి 12 గెలలు వేయడం గమనించారు, మొత్తం తోటలోని గెలలు మొదటి దఫాగా ఏప్రిల్–మే నెలల్లో పక్వానికి వచ్చి కోతకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు, జగిత్యాల జిల్లాలో 2022- 23 ఫిబ్రవరి –మార్చి నెలల్లో నాటిన ఆయిల్ పామ్ తోటల్లో దాదాపు 90% వరకు ఏప్రిల్–మే నెలల్లో కోతకు రావడం జరుగుతుంది అని తెలిపారు, అదే విధంగా జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు జగిత్యాల జిల్లాలోని ఆయిల్ పామ్ రైతులందరు ఉద్యాన శాఖ సలహాలు సూచనలు పాటించడం జరిగిందని కావున 2–3 నెలల్లో కోతకు వచ్చే ఆయిల్ తోటల రైతులు సంయమనం పాటించి సూచించిన యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరారు అదే విధముగా గెలల కోతకు సంబంధించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గెలలు కోసే విధానం గురించి ఉద్యాన శాఖ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు, ఈ కార్యక్రమంలో ధర్మపురి ఉద్యాన అధికారి శ్రీమతి అర్చన, హెచ్ ఈ ఓ వంశీ, అన్వేష్ ఫిన్లెక్స్ డ్రిప్ కంపెనీ డిసిఓ వెంకటేష్ ,రాజేశ్వర్ రావు, సత్యనారాయణ రావు, రాంచందర్ రావు అయిల్ పామ్ అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విత్తన పండుగతో సాంప్రదాయ వ్యవసాయానికి నూతన ఊపిరి

### సాంప్రదాయ విత్తనాలతోనే కార్పొరేట్ కంపెనీలకు చెక్

### దేశీయ విత్తనాల పరిరక్షణ అత్యవసరం

### అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి






**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):**అంతర్జాతీయ పోటీ పరిస్థితుల్లో దేశీయ విత్తన సంస్థలను పరిరక్షించడం అత్యంత అవసరమని ముల్కనూర్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థలు హైబ్రిడ్ విత్తనాల వ్యాపారంతో రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రభావం చూపుతున్నాయని, సాంప్రదాయ విత్తనాల పరిరక్షణ ద్వారానే వాటికి చెక్ పెట్టవచ్చని సూచించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో సెంటర్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ (సిజిఆర్) మరియు భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల పరిధిలోని 180 పాఠశాలల్లో విద్యార్థులకు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దేశీయ విత్తనాల పరిరక్షణతోనే రైతులకు ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతులు సాంప్రదాయ విత్తనాలను సంరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవసాయ అధికారులు సంగ శ్రీనివాస్, అచ్యుత రెడ్డి, ప్రశాంత్, అర్జున్, సాయికృష్ణ, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలతో ఆకట్టుకున్న ములుకనూరు సహకార సంఘం

### 52 మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు ములుకనూరు సంఘం పరిచయం

### సహకార శాఖ సేవలకు శిక్షణ ఎంతో ఉపయోగకరం అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి





**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు) :**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసిఎం), హైదరాబాద్ ఆధ్వర్యంలో 36 వారాల హయ్యర్ డిప్లొమా ఇన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్ర సహకార శాఖకు చెందిన 52 మంది నూతనంగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ములుకనూరు కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీని సందర్శించారు. సహకార రంగంలో ఉత్తమంగా పనిచేస్తున్న సంస్థల పనితీరును ప్రత్యక్షంగా అవగాహన చేసుకునే భాగంగా ఈ సందర్శన నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంఘం సిబ్బంది ములుకనూరు సహకార సంఘం అందిస్తున్న వివిధ సేవలు, నిర్వహణ విధానం, రైతు సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై శిక్షణార్థులకు సమగ్రంగా వివరించారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి నూతనంగా నియమితులైన ప్రభుత్వ అధికారులతో పరస్పర చర్చ జరిపి, సంఘం ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై వివరించారు. అలాగే నూతన అధికారులను అభినందిస్తూ, ఈ శిక్షణ కార్యక్రమం వారి భవిష్యత్ సహకార శాఖ సేవలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆవుల అఖిలేష్ ఏడవ జన్మదిన సందర్భంగా

### పిల్లలకు క్రీడా కిట్టు పంపిణీ





**గొల్లపల్లి ఫిబ్రవరి 07 ప్రజా మంటలు :**గొల్లపెల్లి మండల కేంద్రంలో శనివారం ఆవుల అఖిలేష్ ఏడవ పుట్టినరోజు సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్లో పిల్లలు ఆడుకోవడానికి మానసిక ఉల్లాసంగా ఉండడానికి క్రీడా కిట్ పంపిణీ చేశారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ పిల్లలకి చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమే అని అన్నారు. హాస్టల్ పిల్లలు మరియు టీచర్లు అఖిలేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో ఎస్ ఓ పద్మ,శైలజ,జలజ,జ్యోతి రాణి, పి ఈ టి, వనజ,ఆవుల వెంకటేష్, ఆవుల రాజశేఖర్,ఎల్పుల సురేష్ ,ఎల్పుల రాము, మారం తిరుపతి, ఆవుల సాయి, బోడపట్ల మధు కొండ మహేష్, తదితరులు పాల్గొన్నారు..

## సుందరగిరి గ్రామంలో మంచినీటి సరఫరాపై సమీక్ష

### నీటి ఎద్దడి తీర్చుటకు ముందస్తు ప్రణాళిక...



**చిగురుమామిడి ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):**గ్రామ ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశంతో సర్పంచ్ జంగ శిరీష ఆధ్వర్యంలో గ్రామంలో మంచినీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర సమీక్ష నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ (వీణా) విజయ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ జ్ఞానేశ్వరి, పంచాయతీ కార్యదర్శి గొల్లెన సంపత్ కుమార్, ఉపసర్పంచ్ మేడబోయిన రాజు, వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్ కుమార్, పెసరి రాజాకృష్ణ, శ్రీమూర్తి శ్రీనివాస్, గీరబోయిన రవీందర్, ఎనగందుల రాజేశ్వరి, మంథని ప్రియాంక, నాంపల్లి శిరీష, పేసరి ప్రమీల గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.గ్రామంలో ఉన్న బోరు బావులు, వాటర్ ట్యాంకులు, మోటార్లు, పైప్‌లైన్లు, గేట్ వాల్వులు మొదలైన వాటి పనితీరును పరిశీలించి, ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించారు. పనిచేయని మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, లీకేజీలు ఉన్న పైప్‌లైన్లను సరిచేయాలని, గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ పూర్తి స్థాయిలో లేనందున కొన్ని ఇండ్లకు నీటి సరఫరా కావడం లేదు కావున ఇలా నీటి సరఫరా జరగని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జంగ శిరీష మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోజువారీ మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయం, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. అలాగే గ్రామ ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా మంచినీటి సరఫరాను ప్రధాన అంశంగా తీసుకొని, అన్ని విభాగాలు కలిసి పనిచేస్తూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని తెలిపారు.

## సారంగాపూర్ ఫారెస్టులో ఫోక్ సాంగ్ షూటింగ్ సందడి



**జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):**జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అటవీ ప్రాంతంలో 'కడదాకా తోడుంటనే' ఫోక్ సాంగ్ చిత్రీకరణ శనివారం సందడిగా జరిగింది. బొమ్మరిల్లు ఫోక్స్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో వేణు, గంగాధర్ పర్యవేక్షణలో ఈ పాట రూపొందుతోంది.డైరెక్టర్ రాజ్ నరేందర్ దర్శకత్వంలో, హరిష్ పటేల్ కెమెరా పనులతో చిత్రీకరణ సాగగా, సోని వైష్ణవి, ఈశ్వర్ సాయి ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్‌ను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, హేమారెడ్డి, శ్రీకాంత్, హరి ప్రసాద్, మానాల నటరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ పట్టణంపై గులాబీ జెండా ఎగురవేస్తాం

### దావ వసంత సురేష్



**రాయికల్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):**రాయికల్ పట్టణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 1, 5, 10, 11, 12 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తయినా రాయికల్‌లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి అంతా కేసీఆర్ హయాంలోనే జరిగిందని, మళ్లీ కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలు మోసపోతారని అన్నారు. కారు గుర్తుకే ఓటేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాయికల్ పట్టణంలో తప్పకుండా గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకే ఓటు

### కొప్పుల ఈశ్వర్



**రామగుండం, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):**రామగుండం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో 48, 9, 39, 11, 43, 42, 13, 55, 57 డివిజన్లలో నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ ఇంచార్జి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని విస్తృత ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలు మరిచిపోవాలనే ఉద్దేశంతో కేసీఆర్‌ను తిట్టడమే కాంగ్రెస్ పని అయిందన్నారు. బతుకమ్మ చీరలు, దివ్యాంగుల పింఛన్, ఉద్యోగాలు, రైతులకు హామీలుఃశ్రీశ్రీ మోసాలేనని ఆరోపించారు.కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలని, రామగుండంలో బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమం




**ఎల్కతుర్తి ఫిబ్రవరి 07 ప్రజా మంటలు :**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలో బాలిక సాధికారత కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్భాపూర్ లో బాల్య వివాహాలు నిషేధం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జి సి డివో ఎస్. సునీత గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి బాలికల విద్యా, ఆరోగ్యం, భవిష్యత్తు పరిరక్షణకు బాల్య వివాహాల నివారణ ఎంతో అవసరమని తెలిపారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది

### తాటిపర్తి జీవన్ రెడ్డి



**రాయికల్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):**రాయికల్ పట్టణ కేంద్రంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జగిత్యాలరాయికల్ ప్రాంతాల్లో అనూహ్యమైన రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయని, పదేళ్ల పాటు కాంగ్రెస్ జెండాను విడువకుండా కష్టకాలంలో పోరాడిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో జగిత్యాల, రాయికల్‌లో అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను పక్కన పెట్టి, ఇతర పార్టీల వారికి బీఫారాలు ఇచ్చారని విమర్శించారు. అభివృద్ధి అనేది పౌరుల హక్కు అని, తాను పదవిలో ఉన్నా లేకున్నా రాయికల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని తెలిపారు.రాయికల్ మున్సిపాలిటీ గత ఐదేళ్లుగా అవినీతి కేంద్రంగా మారిందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. వలసవాదులు, అవకాశవాదులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధంతో, ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తానని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## అడ్వకేట్ స్వప్న హత్య ఘటనపై మహిళా న్యాయవాదుల దిగ్భ్రాంతి



**సికింద్రాబాద్,పిబ్రవరి 07 ( ప్రజామంటలు):** ఆస్తి వివాదం కారణంగా అన్న స్వంత చెల్లెల్ని హత్య చేసిన ఘటనను తెలుసుకుని చేవెళ్ల కు వెళ్ళిన హైకోర్టు న్యాయ వాదులు డాక్టర్ జి. సుభా షిణి, శైలజ, ప్రేమలత, నిర్మ ల, దేవేందర్ లు ఈ ఘట నను తీవ్రంగా ఖండించారు శనివారం వీరు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నామని తెలిపారు.స్వప్న న్యాయవాదిగా చేవెళ్ల, రాజేంద్రనగర్ కోర్టుల్లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతుందని పేర్కొన్నారు. అక్క పెళ్లి ముందే జరగడంతో స్వప్న వివాహ ఖర్చుల నిమిత్తం తల్లి మొదటి భార్య పేరిట ఉన్న మూడున్నర ఎకరాల భూమిని స్వప్న పేరుపై రాసి, అందులో ఒక ఎకరం విక్రయించి పెళ్లి చేయాలని నిర్ణయించుకుందని తెలిపారు. అయితే అంతలోనే అన్న అడ్డుపడటంతో స్వప్న వివాహం నిలిచిపోయిందని వివరించారు. సమాజంలో మహిళలపై రోజు,రోజుకి పెరుగుతున్న దాడులకు ఈ ఘటన నిదర్శనమని, ఈ సంఘటనను ప్రతి ఒక్కరు ఖండించాలని మహిళా న్యాయవాదులు కోరారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలని,ఈ శిక్ష అందరిలో కనువిప్పు కావాలని అడ్వకేట్ డాక్టర్ జి.సుభాషిని అన్నారు.అడ్వకేట్లు ఈసందర్భంగా లాయర్ స్వప్న చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, తల్లికి ధైర్యం చెప్పారు.

# శ్రీ శ్రీనివాసఆంజనేయ భవాని శంకర ఆలయంలో ఘనంగా పూర్ణాహుతి



**జగిత్యాల ఫిబ్రవరి 7 (ప్రజా మంటలు) :**జిల్లా కేంద్రం కూరగాయల మార్కెట్ లోని శ్రీ శ్రీనివాసాంజనేయ, భవాని, శంకర దేవాలయం లో వార్షికోత్సవాల్లో భాగంగా మూడవరోజు పూర్ణాహుతి స్థాపిత దేవత ప్రధాన కలశ ఉద్వాసన మహా అన్నదాన ప్రసాద వితరణ, సాయంత్రం పురవీధులలో స్వామివార్ల శోభాయాత్ర ఘనంగా జరిగింది ఈనాటి కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్,ఫ్యామిలీ మెంబర్,బాసెట్టి లవ కుమార్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ మంచాల గోపాల్,గౌరిశెట్టి రాజు, ధర్మకర్తలు గౌరిశెట్టి గణేష్, బంగ్లా శేఖర్, రాగి వెంకటేశం, వొ ల్లాల సత్తయ్య, గౌరిశెట్టి సాధన, అనుమల్ల ఉమాభారతి, ఆలయ ప్రధాన అర్చకులు మేడిపల్లి రాజన్న శర్మ, రుద్రంగి శ శంక మౌళి, రుద్రంగి గోపాలకృష్ణ, రుద్రంగి రాఘవేంద్ర శర్మ, శ్రీమాన్ నంబి నర్సింహ చార్యులు, సూరజ్ శర్మ, తిగుళ్ళ సూర్యనారాయణ శర్మ, రుద్రంగి మహదేవ్, బండారు జగన్,,విష్ణు, రాంగోపాల్, బండపల్లి జగన్, శ్రీమాన్ విజయ్ కుమార్, రంజిత్ కుమార్ ఆచార్య, శ్రీనివాసచారి, బాలాజీ సేవా సమితి అధ్యక్షుడు చిలక రాజన్న, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న

### డా బోగ శ్రావణి




**జగిత్యాల ఫిబ్రవరి 7 (ప్రజా మంటలు)** :మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల మున్సిపల్ 36వ వార్డ్ అభ్యర్థి పుల్ల సుమలత-హరీష్ ,21వ జగ్గుల శిరీష కి మద్దతుగా స్థానిక అన్నపూర్ణ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్లో పాల్గొని పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణిఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొండా లక్ష్మణ్ ,సుంచ్ సురేష్,జంబుక శివ,కొండ రవితేజ, అరుణ్ యాదవ్,మహేష్ మరియు వార్డు మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులను ఆకర్షిస్తున్న సైకత శ్రీనివాసుని విగ్రహం



**జగిత్యాల ఫిబ్రవరి 7 (ప్రజా మంటలు) :**జిల్లా కేంద్రంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ప్రారంభమైన సైకత శ్రీనివాసుని విగ్రహ ప్రతిష్ట, జరిగి మూడో రోజుకు చేరింది. ఇంతటి మహి మాన్వితమైన సైకత శ్రీనివాసుని దర్శించడానికి జనాలు, భక్తులు తండుపతండాలుగా వచ్చి దర్శనం చేసుకుంటున్నారు. ఈనెల ఐదవ తేదీన శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక చే ప్రారంభమైన ఈ సైకత కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకుని, ఎంతోసేపు ఈ పవిత్రమైన క్షణాలను ఆస్వాదిస్తున్నారు. వచ్చేనెల మార్చి 5 వరకు ఈ దర్శనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు . శివరాత్రి పండుగ రోజు, ఇక్కడే సైకత శివలింగాన్ని ప్రతిష్టించి శివకేశవు లను ఏకకాలంలో దర్శించుకునే భాగ్యాన్ని వేముల ఉమారాణి కొండ్ర రమాదేవి కల్పించనున్నట్లు తెలిపారు.

# జగిత్యాల పలు వార్డులలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న డా బోగ శ్రావణి



**జగిత్యాల ఫిబ్రవరి7 (ప్రజా మంటలు)** :మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఈరోజు జగిత్యాల పట్టణంలోని 32వ, 33వ, 34వ వార్డుల లో ఇంటింటి ప్రచారం నిర్వహించి బిజెపి అభ్యర్థులను పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాల్సిన అభ్య ర్థించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా బోగ శ్రావణి ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూజగిత్యాల మున్సిపల్ కి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ అమృత్ 2.0 పథకం 60 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేపించారు కేంద్రీయ విద్యాలయం కూడా జగిత్యాల ప్రజలకు అందించిన ఘనత నిజామాబాద్ ఎంపీ అరవింద్ కు దక్కుతుందన్నారు.ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే జగిత్యాల మున్సిపల్ కి మరిన్ని కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొండ లక్ష్మణ్ ,దూరిశెట్టి మమత,సుంచ్ సురేష్,నీలి మధు,బలే అభి,అఖిల్,వంశీ వార్డ్ మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు

**లైకుల కోసం జంతు బలులు**

**సోషల్ మీడియాలో అభ్యంతరకరంగా, అసభ్యకరంగా పోస్టులు పెడితే కేసులు తప్పడం లేదు**

**ప్రజలకు ఉపయోగపడే ఏ విషయాన్నైనా అది నిజమైతే తెలియజేయవచ్చు**

**మార్ఫింగ్ చేస్తే ఊచలు లెక్కెట్టాల్సిందేనని హెచ్చరిస్తున్న సైబర్‌క్రైం**



నేటి ఆధునిక ప్రపంచంలో సోషల్ మీడియా ప్రతీ ఒక్కరి జీవితంపై ప్రభావం చూపుతోంది. పిల్లలు నుంచి పెద్దల దాకా అందులో లీనమైపోతున్నారు. ఈ క్రమంలో కొందరు రీల్స్‌కు అలవాటు పడుతున్నారు. మరికొందరూ సొంతంగా క్రియేట్ చేస్తూ అప్‌లోడ్ చేస్తున్నారు. తమ వీడియోలతో ఎక్కువమంది ఆకర్షించాలిని వారి పెట్టే పోస్టుల కారణంగా జైలు పాలవుతున్నారు. ఇతరులకు ఇబ్బంది పెట్టేలా అభ్యంతకరంగా, అసభ్యకరంగా ఉంటే వాటిపై కేసులు తప్పడం లేదు. ఏ కంటెంట్ చేయొచ్చు, ఏమి చేయకూడదో ఈ కథనంలో తెలుసుకుందాం.సాధారణంగా సామాజిక మాధ్యమాల ద్వారా తెలియాని విషయాలు గురించి తెలుసుకునేందుకు ఎంతో సులభంగా ఉపయోగపడుతోంది. కానీ కొందరూ లాభాపేక్ష అవసరాల కోసం దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. యువత, పెద్దలు చేసే వీడియోల ప్రభావం చిన్నారుల మీద పడుతోంది. లైక్‌ల మోజులో పడి ఇష్టం వచ్చినట్లు పరిధి దాటి ప్రవర్తిస్తున్నారు. పోలీసులు ఎంత హెచ్చరిస్తున్నా లెక్క చేయడం లేదు.

**'ఆటో సేవ్' చేస్తున్నారా?**

గత 3 ఏళ్లలో నమోదైన కేసుల్లో విద్యార్థులు, యువతే ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఓ కంట పిల్లలను కనిపెడుతూ ఉండాలి. సోషల్ మీడియా ఖాతాలకు పేరెంట్స్ కంట్రోల్ ఆప్షన్ పెట్టుకోవాలి. లేదంటే ముమ్మందు చిక్కులు తప్పవు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత, బ్యాంకుల వివరాలను 'ఆటో సేవ్' చేయకూడదు. అలా చేస్తే సైబర్ కేటుగాళ్లకు చిక్కినట్లే. కొన్ని ఏళ్ల క్రితం రాజాం పట్టణానికి చెందిన ఓ బాలుడు ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన చూసి క్లిక్ చేయగా క్షణాల వ్యవధిలోనే రూ.వేలు మాయం అయ్యాయి.

**ఉదాహరణలు:**

పార్వతీపురం గ్రామీణ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉడుమును చంపి, కూర వండుకున్నారు. సంబంధిత వీడియోను సోషల్ మాధ్యమాల్లో పోస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వారిపై అటవీశాఖ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదైంది.మరోవైపు విజయనగరానికి చెందిన ఓ పార్టీ కార్యకర్త మరో పార్టీ నేతపై దుర్భాషలాడుతూ వీడియో చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైరల్ కావాలని అలా చేసినట్లు విచారణలో పేర్కొన్నాడు.ఇవి పోస్టు చేయొచ్చు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేయవచ్చు. ఆరోగ్యం, విద్య, పర్యాటకం, ఆధ్యాత్మికత వంటి విషయాలు చెప్పవచ్చు. విజయ గాథలు, మహనీయుల పుస్తకాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు, రక్తదానం తదితర వాటిపై పోస్టులు పెట్టుకోవచ్చు. ప్రజలకు ఉపయోగపడే ఏ విషయాన్ని అయినా అది నిజమైతే తెలియ జేయవచ్చు.

**ఇవి చేయవద్దు:**

మహిళలను కించపరచరాదు

అసభ్యకర పదజాలం, వ్యక్తిగత దూషణ నిషేధం

మహనీయుల మాటలను మార్చరాదు

అడల్ట్ కంటెంట్ పెట్టరాదు, వాటిని ఇతరులకు షేర్ చేయరాదు

మతం, కులం, ప్రాంతం గురించి తప్పుగా మాట్లాడరాదు

ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదు

ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి పోస్ట్ చేయకూడదు

జంతు బలులు

**ఇలా సంప్రదించండి:**

ఎవరైనా అభ్యంతరకర పోస్టు పెడితే 1930ను సంప్రదించవచ్చు.

ఐటీ చట్టం కింద నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తారు

తీవ్రమైన నేరమైతే జరిమానా, జైలు శిక్ష విధిస్తారు. ఒక్కోసారి రెండు కూడా ఉంటాయి.

అసత్య ప్రచారం చేస్తే 5 ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.

మార్ఫింగ్ చేస్తే 7 ఏళ్లు ఊచలు లెక్క పెట్టాల్సిందేనని హెచ్చరిస్తున్నా సైబర్ క్రైం

పార్వతీపురం మన్యం జిల్లాలో గత 3 ఏళ్లలో పలు కేసులు నమోదు చేశారు. 2023, 2024 సంవత్సరాల్లో 12 కేసులు, 2025లో 6 కేసులు, రాజకీయ అంశాలకు సంబంధించినవి 19 కేసులు నమోదు అయ్యాయి. మన్యంలో గత ఏడాది 28 కేసులు నమోదు అవ్వడం గమనార్హం.

# భోజనం కోసం ఆగినప్పుడు బస్సు మిస్ అయ్యారా

**ఈ ఒక్క పని చేస్తే మరో బస్సులో ఫ్రీగా వెళ్లొచ్చు**

**బస్సులో టికెట్ డబ్బులు, వస్తువులు మరచిపోతున్నారా**

**ఇకపై ఈ నెంబర్‌ను సంప్రదిస్తే నేరుగా మీ ఫోన్ పే, గూగుల్ పేలోకి డబ్బులు**

**ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌తో సమస్యలకు చెక్**



దూర ప్రాంతాలకు ఎక్కువ మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఇందుకు ప్రైవేటు బస్సులు అధిక ఛార్జీలు వసూలు చేయడం ఒక కారణమైతే, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తుందన్న నమ్మకం మరో కారణం. దానికి తోడు ఆర్టీసీ సైతం ప్రయాణికుల కోసం ఎప్పటికప్పుడు వివిధ రకాల సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. అయితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినప్పుడు మనలో చాలా మంది ఎప్పుడో ఒకప్పుడు ఓ సమస్యను ఎదుర్కొనే ఉంటాం. ఏంటా అని ఆలోచిస్తున్నారా? అదేనండీ బస్సు దిగే కంగారులో టికెట్ వెనకాల రాసిన డబ్బులు, లగేజీ వంటివి మర్చిపోవడం.

**అయ్యో - టికెట్ వెనకాల రాసిన డబ్బులు పోయె! :** బస్సులో టికెట్ తీసుకునే సమయంలో సరిపడా చిల్లర ఇవ్వకపోతే మిగతా బ్యాలెన్స్ డబ్బులను కండక్టర్ టికెట్ వెనకాల రాస్తుంటారు. అంటే కొన్నిసార్లు మనం రూ.100, రూ.200, రూ.500 నోటు ఇస్తే, అప్పటికి టికెట్ ఇచ్చి దిగే ముందు బ్యాలెన్స్ తీసుకోమని చెబుతుంటారు. ఆ చిల్లర ఎప్పుడు ఇస్తాడా అని మనం ఆ కండక్టర్‌నే ఓ కంట కనిపెడుతూ ఉంటాం. ఎంత జాగ్రత్తగా ఉంటే మాత్రం ఏం లాభం. మన స్టాప్ రాగానే ఆ కంగారులో చిల్లర తీసుకోకుండానే దిగి పోతుంటాం. తీరా బస్సు వెళ్లిపోయాక జేబులోనో, పర్సులోనో టికెట్ చూసుకుని అయ్యో అనుకుంటాం. ఇక చేసేదేం లేక పోనిలే అని డబ్బులు వదిలేసుకుంటుంటాం. మరి మీకూ ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఇకపై ఎలాంటి టెన్షన్ అవసరం లేదు.

**భోజనం కోసం దిగినప్పుడు బస్సు మిస్సైందా? :** ఇలా ఎప్పుడైనా చిల్లర మర్చిపోయినా, వస్తువులు ఏవైనా ఆర్టీసీ బస్సులో వదిలేసినా మీకు ఇచ్చే టికెట్‌పై ఉన్న హెల్ప్ లైన్ నెంబరు 040-69440000కు సమాచారం అందిస్తే తిరిగి మీకు రావాల్సిన డబ్బులు విచారణ చేసి ఫోన్‌పే ద్వారా అందిస్తారు. అలాగే ప్రయాణం చేసేటప్పుడు ఆర్టీసీ బస్సులో విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు, బ్యాగులు మర్చిపోయినా వెంటనే ఈ హెల్ప్‌లైన్ నెంబరు ద్వారా పొందవచ్చు. అంతేకాదు దూర ప్రయాణం చేసేటప్పుడు మార్గమధ్యలో భోజనం కోసం ఆగినప్పుడు బస్సు మిస్ అయితే, ఆ నెంబర్‌కు ఫోన్ చేస్తే చాలు. అదే టికెట్‌పై మరొక బస్సులో తమ గమ్యానికి చేరవేస్తారు. చాలా మంది ఈ విషయం తెలియక నష్టపోతుంటారు. ఇకపై అలాంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అలాంటి సమస్యలు ఏవైనా ఉంటే హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేస్తే సరిపోతుంది.

**ఇలా ఫిర్యాదు చేస్తే చాలు :** రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణించినా, మన ప్రాంత బస్సుల్లో కండక్టర్ ఈ-టీమ్ ఆధారంగా టికెట్‌ను జారీ చేస్తుంటారు. దానిమీద మనం ప్రయాణించిన తేదీ, టైమ్, ఛార్జీ, బస్సు డిపో వివరాలు, కండక్టర్, డ్రైవర్ సర్వీస్ నంబర్లు తదితర వివరాలు అన్నీ రాసుంటాయి. మీకు కండక్టర్ ఇచ్చిన టికెట్ కింది భాగంలో ఆర్టీసీ హెల్ప్‌లైన్ నంబరు రాసి ఉంటుంది. ఆ నెంబరుకు కాల్ చేసి మనకు కావాల్సిన సేవలు పొందొచ్చు. వారికి సర్వీసు నెంబరు, ప్రయాణించిన తేదీ, సమయం, బస్సు ఛార్జీ, డ్రైవర్, కండక్టర్ సర్వీస్ నెంబర్ తదితర వివరాలు చెప్పాల్సి ఉంటుంది.మనం చెప్పిన వివరాలు అన్నింటిని నిర్ధారణ చేసుకున్నాక అధికారులు సదరు బస్సు సిబ్బందికి సమాచారాన్ని అందిస్తారు. దాని ద్వారా మనకు కావాల్సిన సేవలు పొందొచ్చు. ఈ ప్రాసెస్‌లో మీ వద్ద టికెట్ భద్రంగా ఉంచుకోవడం ముఖ్యం.

# రైలు ప్రయాణం చేస్తున్నారా

**'హ్యాపీ జర్నీ' అందించే ఈ సేవల గురించి తెలుసా**

**ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్న రైల్వే శాఖ**

**సమస్యలపై ఫిర్యాదుల కోసం 139 టోల్‌ఫ్రీ నెంబర్**



ప్రయాణికులు తమ పోయిన వస్తువులపై ఫిర్యాదు చేస్తే తిరిగి వారి చెంతకు చేరుస్తున్న అధికారులు

రైళ్లలో ప్రయాణం చేస్తున్నప్పుడు హడావిడిలో కొన్నిసార్లు వస్తువులను పోగొట్టుకుంటుంటాం. వాటిలో సెల్‌ఫోన్, బంగారం, వెండి లాంటి విలువైనవి కూడా ఉండవచ్చు. మరి అలాంటి వాటిని తిరిగి పొందొచ్చనే విషయం మీకు తెలుసా? రైలు ప్రయాణంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఏ నంబర్‌కు కాల్ చేయాలి? ఎలాంటి సేవలు పొందొచ్చు లాంటి విషయాలు వివరంగా తెలుసుకుందాం.

**ప్రయాణికుల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ :** రైల్వే శాఖ ప్రయాణికుల భద్రతకు, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. రైలు ప్రయాణంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 139ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫోన్‌కాల్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం ఎన్నో రైళ్లు ప్రయాణిస్తుంటాయి. రైల్వే భోగీలో ప్రయాణిస్తున్న వారిలో ఎవరికైనా అనారోగ్య సమస్య ఎదురైనట్లయితే వైద్య సహాయం అవసరమైనప్పుడు 139 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు.

**వస్తువులు జారి పడిపోతే :** రైళ్లల్లో ప్రయాణిస్తున్న సమయంలో సెల్‌ఫోన్, గడియారం, బ్యాగులు, ఇతర వస్తువులు జారి కిందపడితే రైల్వే వారికి ఫిర్యాదు చేయొచ్చు. రైలు ట్రాక్‌ల పక్కనే ఉన్న కరెంట్ పోల్స్‌పై పసుపు రంగులో రాసిన కి.మీ.నంబరును గుర్తించి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి ఏ ట్రైన్, ఏ డివిజన్, ఏయే స్టేషన్ల మధ్య వస్తువును జారవిడుచుకుందీ లాంటివి సంబంధిత అధికారులకు సమాచారాన్ని చేరవేస్తారు.

**రైళ్లలో చోరీ జరిగితే :** ట్రైన్‌లో కిటికీల వద్ద కూర్చొని ప్రయాణిస్తుండటం, నిద్రపోతున్న సమయంలో విలువైన వస్తువులు చోరీకి గురవ్వడం లాంటివి జరిగితే ఆందోళన చెందనక్కర్లేదు. భోగీలో మీ సెల్‌ఫోన్‌లు, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురైనా, మీరు రిజర్వేషన్ చేయించుకున్న సీటు, బెర్తులో వేరొకరు కూర్చొని ఇబ్బందులకు గురి చేసినా 139కు ఫిర్యాదు చేయొచ్చు.

**ఈ సమస్యలపైనా ఫిర్యాదు చేయొచ్చు :** మీరు ప్రయాణిస్తున్న రైలు బోగీలోని మరుగుదొడ్లలో నీటి సరఫరా సమస్యలెదురైనా, పంకాలు పని చేయకపోయినా, లైట్లు వెలగకపోయినా ఫిర్యాదు చేయొచ్చు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగుతున్నా కూడా అలాంటి వారి గురించి కంప్లైంట్ చేయొచ్చు. రైలులో లగేజీని మర్చిపోయినా కూడా ఫోన్ చేసి వివరాలు చెప్పొచ్చు. రైలు పేరు, బెర్తు నంబరు, ఎన్ని గంటలకు బయల్దేరిందీ, మరిచిపోయిన వస్తువులకు సంబంధించిన వివరాలు ఇలా అన్నీ ఫోన్ చేసి వివరంగా తెలియజేయాలి. రైల్వే ఆర్పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్), జీఆర్పీ పోలీసుల సహకారంతో తిరిగి సంబంధీకులకు వాటిని రైల్వే సిబ్బంది అందజేస్తారు.

**మహిళలకు రక్షణ :** మహిళలు ఒంటరిగా గానీ, ఫ్యామిలీ మెంబర్లతో గానీ ప్రయాణిస్తున్న సమయంలో వేర్వేరు బెర్తుల్లో ఉన్నప్పుడు ఎవరైనా వేధింపులకు పాల్పడి ఇబ్బందులకు గురిచేసినా, భోగీలో రక్షణ లేదని భావించినా నేరుగా 139 నంబరుకు ఫోన్ చేయొచ్చు. లేదంటే రైల్వేస్టేషన్లలోని రైల్వే పోలీసులకు అయినా ఫిర్యాదు చేయొచ్చు. మహిళా పోలీసు రక్షణ పొందడం గానీ, అవసరమైతే బెర్తును మార్చుకుని సురక్షిత భోగీలో ప్రయాణించే అవకాశాన్ని గానీ పొందేందుకు అవకాశం ఉంటుంది.ఎవరైతే ట్రైన్‌లో ప్రయాణిస్తూ తమకు సమస్య ఎదురైందని 139 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేస్తారో ఆ రైలు ప్రయాణించే మార్గంలోని రైల్వే డివిజన్ ఆఫీస్‌కు ఈ కాల్ వెళ్తుంది. అక్కడ 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండే సిబ్బంది ఆ వివరాలను వెనువెంటనే తెలుసుకుని, రైలు ఆ తర్వాత చేరే స్టేషన్‌కు సమాచారాన్ని అందిస్తారు. ఆయా రైల్వేస్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి, ఫోన్ కాల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా అక్కడకు చేరుకుని, వారు ప్రయాణించే బోగీలోకి వెళ్లి ప్రయాణికుడి సమస్యను పరిష్కరిస్తారు.

# 'క్వాంటమ్ కంప్యూటర్' సామగ్రిని మనం తయారుచేసే స్థాయికి ఎదగాలి

### జేబీవీ రెడ్డి

**ప్రధానంగా ఏడు స్టార్టప్‌లకు పూర్తి సహకారం**

**ఆల్గరిథమ్స్‌తో పాటు హార్డ్‌వేర్‌పైన ప్రత్యేక దృష్టి**

**పరిశ్రమలతో, చిప్స్ ఫ్యాబ్రికేషన్ను అనుసంధానం చేసే విధంగా కృషి**




రాజధాని ప్రాంతమైన అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీకి నేషనల్ క్వాంటమ్ మిషన్ తరఫున సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నామని 'నేషనల్ క్వాంటమ్ టెక్నాలజీ' సెల్ హెడ్ జేబీవీ రెడ్డి (జొన్నల భాస్కర వెంకటరెడ్డి ) తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ సమీపంలో ఉన్న ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్' ఫైనల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో నాలుగు హబ్‌లు నేషనల్ క్వాంటమ్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం, అయితే వీటిలో 43 విద్యాసంస్థలకు చెందిన 150 మంది వరకు పరిశోధనలు చేస్తున్నారు అని జేబీవీ రెడ్డి తెలిపారు.

**ఏడు స్టార్టప్‌లకు పూర్తి సహకారం :** 'ప్రధానంగా ఏడు స్టార్టప్‌లకు పూర్తి సహకారం అందిస్తున్నాం. వచ్చే ఐదు, పది సంవత్సరాలలో క్వాంటమ్‌లో విద్యార్థులందరూ గ్లోబల్ లీడర్లుగా తయారుకావాలి. ప్రస్తుతం నేర్చుకుంటున్న ఆల్గరిథమ్స్‌తో పాటు హార్డ్‌వేర్‌పైన కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇక్కడ ఐబీఎం ఏర్పాటు చేయబోతున్న క్వాంటమ్ కంప్యూటర్‌కు కావాల్సిన ఇతర సామగ్రిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అటువంటి సామగ్రిని మన దేశంలోనే తయారుచేసే స్థాయికి మనం ఎదగాలి. పరిశ్రమలతో, చిప్స్ ఫ్యాబ్రికేషన్ను అనుసంధానం చేసే విధంగా పని చేస్తున్నాం. క్వాంటమ్ కంప్యూటర్‌కు సహకారం అందించేందుకు 24 గంటలూ అందుబాటులో ఉంటాం. రెండు సంవత్సరాల కిందట వరకు ఎవరికీ క్వాంటమ్ కంప్యూటర్ మీద అంత పెద్ద అవగాహన లేదు. గత సంవత్సరం నుంచి మాత్రమే ప్రచారంలోకి వచ్చింది, కానీ ప్రస్తుతం ప్రతి గల్లీల్లోనూ దీని గురించే చర్చిస్తున్నారు' అని జేబీవీ రెడ్డి తెలిపారు.

**విశ్వవిద్యాలయాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ :** అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిలో నుంచి వంద మందిని ఎంపిక చేసి, వారిని తదుపరి శిక్షణకు తీసుకోనున్నట్లు ఐబీఎం తెలిపిందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలు బీటెక్ కోర్సుల్లో ఇప్పటికే క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సులను ప్రవేశపెడుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రా వర్సిటీ క్వాంటమ్ కోర్సు ప్రారంభించగా, తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వర్సిటీ వచ్చే విద్యా సంవత్సరంలో ఈ కోర్సు ప్రారంభించబోతోందని ఆయన వెల్లడించారు. 'విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు కరిక్యులమ్‌లో మైనర్ డిగ్రీగా క్వాంటమ్ కోర్సును ప్రవేశపెట్టాం. ఎన్‌పీటీఈఎల్ ద్వారా నాలుగు వారాల క్వాంటమ్ కోర్సుకు దాదాపు లక్ష మందికి పైగా విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు' అని తెలిపారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com